గణితంతో ఉజ్వల భవిష్యత్



విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేస్తున్న ఉపాధ్యాయులు

కూకట్‌పల్లి: జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా శనివారం జడ్పీహెచ్‌ఎస్‌లో తెలంగాణ గణిత ఫోరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో కూకట్‌పల్లి, బాలానగర్, బాచుపల్లి మండలాల పదవ తరగతి విద్యార్థులకు మండల స్థాయి గణిత ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు ఆయా మండలాల పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతూ గణితంలో అత్యుత్తమ ప్రతిభ కలిగి ఎంపిక చేసిన తెలుగు, ఇంగ్లీష్ మీడియంకు ముగ్గురు చొప్పున విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యాధికారులు హరీష్ చంద్ర కిషన్, రామకృష్ణ మాట్లాడుతూ.. గణితంలో పట్టు ఉంటే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. గణితాన్ని కష్టంగా కాకుండా ఇష్టంగా భావించి సాధన చేస్తే అత్యుత్తమ ఫలితాలు ఉంటాయన్నారు. మండలాల వారీగా పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన మొదటి, రెండవ, మూడవ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను జిల్లా స్థాయి ప్రతిభా పరీక్షకు ఎంపిక చేసి వారికి ప్రశంసాపత్రం, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో గణిత ఫోరం జిల్లా గౌరవ అధ్యక్షులు గోవింద్, మేడ్చల్ జిల్లా ఏఎస్ఓ అయ్యన్న, హెచ్ఎం నరేందర్‌రెడ్డి, పరీక్ష కేంద్రం కన్వీనర్‌లు పర్మగళ్ల నర్సింహులు, దమయంతి, శంకరప్ప, ఉపాధ్యాయులు ప్రసన్న భారతి, ఇందుమతి, కుసుమ పాల్గొన్నారు.

ఆహార నాణ్యతపై స్పెషల్ ఫోకస్

- విద్యాసంస్థల్లో, హాస్టళ్లలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు
- మండల స్థాయిలో స్పెషల్ ఆఫీసర్‌లు
- జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి నేతృత్వంలో కమిటీ



విద్యార్థులతో భోజనం చేస్తున్న వినోద్‌కుమార్



భోజనం చేస్తున్న డీఈఓ విజయకుమారి

సాక్షి, సిటీబ్యూరో: విద్యా సంస్థలు, సంక్షేమ హాస్టళ్లు, ఆసుపత్రుల్లో ఆహార నాణ్యత పర్యవేక్షణకు స్పెషల్ ఆఫీసర్లను నియమించిన అధికార యంత్రాంగం వారి ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకునేందుకు టాస్క్ ఫోర్స్ టీమ్‌ను రంగంలోకి దింపింది. రాష్ట్రంలోని పలు చోట్ల విద్యాసంస్థలు, హాస్టళ్లలో విద్యార్థులు ఫుడ్ పాయిజన్ వంటి సంఘటనలతో ఆసుపత్రుల పాలైన విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలోనే విద్యా సంస్థలు, హాస్టళ్లకు పంపిణీ చేస్తున్న ఆహార పదార్థాల నాణ్యత పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. అందులో భాగంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కోసం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనం మొదలు.. సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలు, వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆహార నాణ్యతపై నిఘాపెట్టారు. పర్యవేక్షణకు స్పెషల్ ఆఫీసర్లతో సహా టాస్క్ ఫోర్స్ టీమ్ జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. హాస్టళ్లు, విద్యాసంస్థల్లో ఆహార నాణ్యతను తనిఖీ చేసేందుకు ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్ల వారీగా టాస్క్ ఫోర్స్ టీమ్‌లకు బాధ్యతలు అప్పగించిన జిల్లా యంత్రాంగం మండలాల వారీగా 15 మంది జిల్లా స్థాయి అధికారులను స్పెషల్ ఆఫీసర్లుగా నియమించారు. జిల్లా స్థాయిలో కూడా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్‌రెడ్డి నేతృత్వంలో టాస్క్ ఫోర్స్ టీమ్ ఏర్పాటైంది. ఈ టీమ్‌లో సభ్యులుగా డీఎంహెచ్ఓ డాక్టర్. రఘునాథ్ స్వామి, డీఈఓ విజయకుమారి, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ, అభివృద్ధి శాఖల జిల్లా అధికారి వినోద్ కుమార్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ జగన్నాథం, మల్కాజిగిరి జిల్లా కేంద్రం ఆసుపత్రి డాకర్ సునీత, గురుకుల పాఠశాలల జిల్లా అధికారి రజనీకాంత్, ఫుడ్ సేఫ్టీ డిజిగ్నేటెడ్ ఆఫీసర్ డా. మల్లీశ్వరి ఉన్నారు. స్థానికంగా కూడా విద్యా సంస్థలు, హాస్టళ్ల వారీగా కూడా టీమ్‌లను నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ఆహార నాణ్యతపై నిఘా..

విద్యార్థుల, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే విషయంతోపాటు అత్యవసర పరిస్థితులలో సమర్థవంతమైన చర్యలను తీసుకునేందుకు ఈ టీమ్ అన్ని విధాలుగా వ్యవహరిస్తోంది. జిల్లాలో విద్యా సంస్థలు, ఎస్సీ, గిరిజన, బీసీ, మైనార్టీ, సంక్షేమ హాస్టళ్లు, ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్య కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గురుకులాలు, రెసిడెన్షియల్ స్కూళ్లలో ఆహార నాణ్యతను పర్యవేక్షించే బాధ్యతను ఈ టీమ్ చూసుకుంటోంది. ఈ టీమ్ అవసరమైతే ప్రతిరోజు భోజనం తయారు చేసే ముందు స్టోర్ రూమ్, వంట తర్వాత ఆహార నాణ్యత, ప్రమాణాల పాటిస్తున్నట్లు నిర్ధారించాల్సి ఉంటోంది. వంట వండిన తర్వాత ఆహార నాణ్యతను టీమ్ సభ్యులు రుచి చూసి పరిశీలించిన తర్వాత విద్యార్థులకు అందించాల్సి ఉంటోంది. ప్రతిరోజు ఈ బాధ్యతలను విధిగా పూర్తి చేయాల్సి ఉంటోంది.

తనిఖీల్లో స్పెషల్ ఆఫీసర్లు..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని 15 మండలాల పరిధిలో స్పెషల్ ఆఫీసర్లు విద్యా సంస్థలు, హాస్టళ్లలో ఆహార నాణ్యతపై తనిఖీలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో 507 ప్రభుత్వ పాఠశాలలు, 5 ఎస్సీ హైస్కూల్ హాస్టళ్లు, 7 కాలేజీ హాస్టళ్లు ఉన్నాయి. ఒక ఎస్సీ హైస్కూల్ హాస్టల్ ఉండగా, ఐదు కాలేజీ హాస్టళ్లు ఉన్నాయి. మైనార్టీశాఖ పరిధిలో 8 రెసిడెన్షియల్ స్కూళ్లు ఉన్నాయి. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 12 కాలేజీ హాస్టళ్లు కొనసాగుతున్నాయి.

ప్రభుత్వ ఆసుపత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రైవేట్ పాఠశాల, కాలేజీ హాస్టళ్లు ఉన్నాయి. వీటి అన్నింటిలో స్పెషల్ ఆఫీసర్లు శుక్రవారం నుంచి తనిఖీలు నిర్వహిస్తున్నారు. తనిఖీలు నిర్వహించి తదుపరి మూడు రోజులు జిల్లా అధికార యంత్రాంగానికి ఆహార నాణ్యత తదితర విషయాలపై నివేదిక అందజేయాల్సి ఉంటోంది.

సేవలు గుర్తింపునిస్తాయి



ఉద్యోగ విరమణ సందర్భంగా డీసీ కృష్ణయ్యను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు

కూకట్‌పల్లి: ఉద్యోగంలో ఉండగా చేసిన సేవలు గుర్తింపునిస్తాయని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కూకట్‌పల్లి డిప్యూటీ కమిషనర్‌గా పనిచేసిన కృష్ణయ్య శనివారం ఉద్యోగ విరమణ సందర్భంగా ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్కిల్‌లో అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ సతీష్ అరోరా, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్‌లు బాబూరావు, తూము శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ హరికృష్ణయ్య ఉద్యోగ విరమణ సందర్భంగా మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేశారని గుర్తు చేశారు.

పనుల్లో జాప్యం లేకుండా పూర్తి చేయాలి



నాలా పై కప్పు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ తదితరులు

మోతీనగర్: సీసీ రోడ్డు, నాలా పైకప్పు పనుల్లో జాప్యం లేకుండా పూర్తి చేయాలని కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ అధికారులకు సూచించారు. కబీర్‌నగర్, అవంతి నగర్, అవంతి నగర్ తోటలో రూ.95 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు, నాలా పైకప్పు పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 8 నెలలుగా జీహెచ్‌ఎంసీ సిబ్బంది వల్ల పనుల్లో జాప్యం జరిగిందని, కబీర్‌నగర్ నాలా పైకప్పు విషయంలో కూడా సరైన సమయానికి నిధులు సమకూరకపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్ పనుల్లో జాప్యం చేశారని తెలిపారు. నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి అయ్యేలా దృష్టి సారించాలని ఏఈ వర్షిని, ఇన్‌చార్జి ఏఈ రంజిత్, డీఈ శంకర్‌లను ఆదేశించారు. కార్యక్రమంలో ఎర్ర స్వామి, రమేష్ నాయుడు, మల్లేష్‌గౌడ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధికి ఎల్లవేళలా కృషి



పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీని సన్మానిస్తున్న కాలనీ వాసులు

ఆల్విన్‌కాలనీ: కాలనీల అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అన్నారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధి రాంనరేష్ నగర్‌లో రోడ్డు పనులు పూర్తయిన సందర్భంగా కాలనీ వాసులు శనివారం కలిసి ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలనీలో అసంపూర్తిగా మిగిలిన రోడ్లను త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. త్వరలో కాలనీలో పర్యటిస్తానని వెల్లడించారు. కార్యక్రమంలో పోతుల రాజేందర్, చాట్ల రవి, వెంకటేష్‌యాదవ్, సత్యనారాయణ, మహేందర్ రెడ్డి, కోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీపీఎం మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు, ఆటో డ్రైవర్లు, వీధి వ్యాపారులు

కూకట్‌పల్లి: సీపీఎం మేడ్చల్ –మల్కాజిగిరి జిల్లా మూడవ మహా సభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి ఎం. శంకర్, సుధాకర్ అన్నారు. మండల కమిటీ ఆధ్వర్యంలో జేఎన్‌టీయూ వద్ద ఆటో కార్మికులు, వీధి వ్యాపార కార్మికులతో కలిసి శనివారం వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై సీపీఎం నిరంతరం పోరాటం చేస్తుందని, కుల, మత, ప్రాంతీయ బేధాలకు వ్యతిరేకంగా అసమానతలు లేని నవ భారత నిర్మాణం కోసం కృషి చేస్తుందన్నారు. జిల్లా మహాసభలు డిసెంబర్ 7, 8 తేదీల్లో ప్రగతినగర్ లీలా సుందరయ్య ఫంక్షన్ హాల్‌లో జరుగుతాయని తెలిపారు. ప్రజా ఉద్యమాలను బలపర్చడానికి తమ వంతు ఆర్థిక సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో రాము, సాయి, కళావతి, శోభారాణి, భాస్కర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కునందజేస్తున్న జగదీశ్వర్ గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ రిక్షా పుల్లర్స్ కాలనీకి చెందిన దోరపల్లి శంకర్‌కు రూ.57,500 సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. ఆ చెక్కును కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ చేతుల మీదుగా లబ్ధిదారుడికి శనివారం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు బాషిపాక యాదగిరి, దోరపల్లి పరశురాములు, బొల్లం యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు మహాపడి పూజ మహోత్సవం

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ కాలనీలోని అయ్యప్ప స్వామి దేవస్థానంలో కొలన్ శ్రీనివాస్ రెడ్డి గురుస్వామి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు హరిహర పుత్ర అయ్యప్ప స్వామి 18 కళశాల మహాపడి పూజా మహోత్సవం నిర్వహించనున్నారు. గుడివాడ బ్రదర్స్‌చే భజన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. అయ్యప్ప స్వామి భక్తులు పూజలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

బాలానగర్: చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఓ మహిళ శనివారం మృతి చెందింది. పోలీసుల వివరాల ప్రకారం.. హెచ్‌ఏఎల్ కాలనీలో నివసించే నిర్మల (37) 28న ఉదయం తన ఇంటి నుంచి బయలుదేరి కాలనీలోకి రాగానే ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. దీంతో ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శనివారం సాయంత్రం మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరసింహ రాజు తెలిపారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

మియాపూర్: మియాపూర్ మయూరినగర్‌లోని శ్రీ కాశీ విశాలాక్షీ సమేత విశ్వేశ్వరస్వామి, ధ్యాన మారుతీ మందిరంలో కార్తీక పూజలు ఘనంగా జరిగాయి. స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి పలు రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం పార్వతీ పరమేశ్వర కల్యాణం, వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ ఘనంగా జరిపించారు. చుట్టుపక్కల కాలనీలవాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. ఎల్లమ్మబండ పరిధిలోని మహాత్మా గాంధీ నగర్‌లో రూ.50 లక్షల నిధులతో నూతనంగా నిర్మిస్తున్న కమిటీ హాల్ నిర్మాణ పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో చిన్న చిన్న ఫంక్షన్లు జరుపుకోవడానికి, సమావేశాలు నిర్వహించుకోవడానికి కమిటీ హాల్ కాలనీ ప్రజలకు ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో దొడ్ల రామకృష్ణ గౌడ్, సమ్మారెడ్డి, పాండుగౌడ్, గుడ్ల శ్రీనివాస్, పోశెట్టి గౌడ్, ధనుంజయ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా కల్యాణం



మూసాపేట: భరత్‌నగర్ కాలనీలోని హరిహర క్షేత్రంలో శుక్రవారం రాత్రి కార్తీక మాసం మాస శివరాత్రి సందర్భంగా కాశీ విశాలాక్షి విశ్వేశ్వర స్వామి కల్యాణం ఘనంగా జరిగింది. శనివారం రాత్రి స్వామివారిని భరత్‌నగర్ కాలనీ పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నాగిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ఆశ చూపి నగలు దోచుకున్నారని మహిళ ఫిర్యాదు

దుండిగల్: నడుచుకుంటూ వెళ్తున్న తనతో మాట కలిపి గుర్తు తెలియని వ్యక్తులు నగలు దోచుకున్నారంటూ ఓ మహిళ దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసుల వివరాల ప్రకారం.. మల్లంపేట ప్రాంతానికి చెందిన పద్మ(55) శనివారం ఉదయం మార్కెట్‌కు నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు వచ్చి ఆమెతో మాటలు కలిపారు. బంగారంపై ప్రస్తుతం ఉన్న మార్కెట్ ధర కన్నా ఎక్కువ డబ్బులు చెల్లిస్తామని ఆశ చూపారు. వాళ్ల మాటలను నమ్మిన పద్మ ఒంటిపై ఉన్న రెండు తులాల బంగారు గొలుసు, తులం కమ్మలు, ఉంగరాలు తీసి వారికి ఇచ్చింది. వాళ్లు చేతి రుమాలులో డబ్బులు పెట్టి ఆమెకు ఇచ్చారు. ఇంటికి వెళ్లి చూసే సరికి అందులో తెల్ల కాగితాలు ఉన్నాయి. బాధితురాలు దుండిగల్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా పద్మ పోలీసులకు పొంతన లేని సమాధానాలు చెప్పింది. ఒక సారి ఆటోలో వచ్చి తన ఫోన్ తీసుకున్నారని, మరో సారి తన ఫోన్ పగలగొట్టారని పేర్కొంది. సీసీ ఫుటేజీలను పరిశీలిస్తూ దర్యాప్తు చేస్తున్నామని డీఐ సతీష్ తెలిపారు.



తెలంగాణ యూత్ డే వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కూకట్‌పల్లి: కాంగ్రెస్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి తెలంగాణ యూత్ డే వాల్ పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. తెలంగాణ జన సమితి అనుబంధ యువజన, విద్యార్థి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎర్ర వీరన్న ఆధ్వర్యంలో మలిదశ తెలంగాణ అమరుడు శ్రీకాంతాచారి వర్ధంతి సందర్భంగా డిసెంబర్ 3న బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ యూత్ డే సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమరుల స్ఫూర్తిని మరిచి పరిపాలన చేసిందన్నారు. నాలుగు సంవత్సరాలుగా అమరుడు శ్రీకాంతాచారి వర్ధంతిని తెలంగాణ యూత్ డేగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గోపాల్, శ్రీధర్‌చారి, గిరి నాయుడు, రాజు తదితరులు పాల్గొన్నారు.

దశల వారీగా సమస్యల పరిష్కారం




డ్రైనేజీ పైపులైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

ఆల్విన్‌కాలనీ: ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు అన్నారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని సాయి ప్రశాంత్ నగర్ ఫేజ్ 2 కాలనీలో సొంత ఖర్చులతో వేయిస్తున్న డ్రైనేజీ పైపులైన్ పనులను అధికారులు, కాలనీ వాసులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ చిన్న సమస్య అయినా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కాలనీలను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామన్నారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులతో అసభ్య ప్రవర్తన

శ్రీ చైతన్య లెక్చరర్‌పై విద్యార్థినులు, తల్లిదండ్రుల ఫిర్యాదు




కెమిస్ట్రీ లెక్చరర్ హరీష్



కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు, తల్లిదండ్రులు

మియాపూర్: విద్యాబుద్ధులు నేర్పాల్సిన లెక్చరర్ విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడమే కాకుండా మేసేజ్‌లు చేస్తూ వేధింపులకు గురిచేస్తున్న సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మదీనాగూడ శ్రీ చైతన్య కళాశాలలో చోటుచేసుకుంది. బాధిత విద్యార్థిని తల్లిదండ్రులు, విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం..శ్రీ చైతన్య కళాశాలలో కందుకూరి హరీష్ కెమిస్ట్రీ లెక్చరర్‌గా పని చేస్తున్నాడు. గత కొంతకాలంగా కళాశాలలో విద్యార్థినులను తరగతి గదిలోకి ఒంటరిగా పిలిచి అసభ్యకరంగా ప్రవర్తిస్తూ వారి నుండి ఫోన్ నంబర్లు తీసుకుని వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్‌లలో మేసేజ్‌లు చేస్తున్నాడు. బయటకు చెబితే అంతుచూస్తానని బెదిరించాడు. దీనిపై యాజమాన్యానికి ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం విద్యార్థి సంఘాల నాయకులతో కలిసి వారు కళాశాల ముందు ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న మియాపూర్ ఎస్ఐ వెంకటేశ్వర్లు అక్కడికి చేరుకుని బాధిత విద్యార్థులతో మాట్లాడారు. కెమిస్ట్రీ లెక్చరర్ హరీష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని బాధిత విద్యార్థినుల తల్లిదండ్రులు మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. లెక్చరర్ హరీష్ పరారీలో ఉన్నాడు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



కార్తీక్ (ఫైల్)

మియాపూర్: డీసీఎం వాహనం ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వెనుక నుండి ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందగా మరో యువకుడికి గాయాలైన సంఘటన మియాపూర్ పోలీస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా కుల్చారం మండలం రంగంపేట గ్రామానికి చెందిన కోటా మధుసూదన్, పద్మ దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. పెద్ద కుమారుడు కోటా కార్తీక్(20) కూకట్‌పల్లిలోని ఓ హాస్టల్‌లో ఉంటూ అవినాష్ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ క్రమంలో కోట కార్తీక్ శనివారం తెల్లవారు జామున స్నేహితుడైన రాంచందర్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై కూకట్‌పల్లి నుండి పటాన్‌చెరు వెళ్తుండగా మార్గమధ్యలో మియాపూర్ మెట్రో పిల్లర్ 606 వద్దకు రాగా పాల డీసీఎం డ్రైవర్ బస్వరాజ్ ఉన్నట్టుండి బ్రేక్ వేయడంతో వెనక వస్తున్న ద్విచక్ర వాహనం డీసీఎంను ఢీకొంది. దీంతో కార్తీక్, రాంచందర్‌లు కిందపడ్డారు. తీవ్రగాయాలవడంతో స్థానికులు దగ్గర్లో ఉన్న ఆసుపత్రికి తరలించగా కార్తీక్‌ను పరిశీలించిన డాక్టర్లు కార్తీక్ బ్రెయిన్ డెడ్ అయినట్లు చెప్పారు. రాంచందర్ చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మియాపూర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని డీసీఎంను స్వాధీనం చేసుకున్నారు. మృతుడు కార్తీక్ తండ్రి కోట మధుసూదన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మహిళలను వ్యవస్థాపకులుగా మార్చడమే లక్ష్యం

'సెర్ప్' సీఈఓ దివ్య



నిథమ్‌లో ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్ల నిర్వాహకులతో అధికారులు

రాయదుర్గం: మహిళలను వ్యవస్థాపకులుగా మార్చడమే ప్రభుత్వం లక్ష్యం అని 'సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ (సెర్ప్) సీఈఓ దివ్య పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని 'నిథమ్'లో ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్ల నిర్వాహకులకు నాల్గవ విడత శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న వారు ప్రభుత్వ కార్యాలయాల్లో, ఇతర సంస్థలలో క్యాంటీన్లను నిర్వహించేలా ఏర్పాట్లు చేశారన్నారు. పరిసరాల శుభ్రత, రుచికరమైన, నాణ్యత కలిగిన ఆహారపదార్థాలు వినియోగదారులకు అందించేలా చూసుకోవాలన్నారు. అంతకుముందు నిథమ్ ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంకెగణేష్, సెర్ప్ డైరెక్టర్ డబ్ల్యూ జాన్సన్ పర్యవేక్షణలో చెఫ్‌లు మహేష్, తుల్జారామ్, సెర్ప్‌డీపీఎం హమీద్, నిథమ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ మిషెల్లి జే ఫ్రాన్సిస్ ఆధ్వర్యంలో ఆహార పదార్థాలను తయారు చేసి వారికి చూపించారు. అనంతరం వంటలో మెళకువలను నేర్పించారు. నిథమ్ ఫ్యాకల్టీ ప్రతినిధులు, సెర్ప్ అధికారులు పాల్గొన్నారు.